
ఈనాడు
పార్వతీపురం మన్యం

బుధవారం అక్టోబరు 2, 2024

వావ్.. వాక్కాయ పచ్చడి.. చింతపండు చాక్లెట్

ఎత్తైన కొండలు.. ఎటు చూసినా సేంద్రియ పంటలు.. చిరుధాన్యాలు, పోషకాలు గల దుంపలకు కొదవ లేదు. చింతపండు, జీడి లాంటివి దొరకని ప్రాంతమే ఉండదు. - న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం



కానీ ఏం లాభం..

గిరిజనులు కొండలపైకి వెళ్లి సేకరించిన పంటలకు సరైన మద్దతు ఉండదు. చెమట చిందించి పట్టుకొచ్చే సరకులు తక్కువ ధరలకే దళారులు దోచుకుంటే నిరాశతో ఇంటికి చేరడమే వారి పని.

ఆ పరిస్థితికి స్వస్తి

కొండలపై పంటలతో మేలైన ఉత్పత్తులు తయారు చేసేలా కృషి విజ్ఞాన కేంద్రం గిరిజన మహిళలకు శిక్షణ ఇస్తోంది. చిరుధాన్యాలు, దుంపలు, ఆకుకూరలు, పండ్లతో ఆహార ఉత్పత్తులు తయారు చేయిస్తోంది.

మన్యంలో లభించే వనరులతో గిరిజన మహిళలు వ్యాపార రంగంలో ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కృషి విజ్ఞాన కేంద్రం ప్రయత్నిస్తోంది. ముందుగా కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలంలోని 15 మంది మహిళలను ఎంపిక చేసి ప్రభుత్వం, ఆత్మ సహకారంతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఇటీవల శిక్షణ ఇచ్చింది. దీంతో పాటు బ్యాంకుల ద్వారా రుణాలు పొందడం, వ్యాపారంలో స్థిరపడటం మొదలైన అంశాలను తెలియజేశారు. వాక్కాయ, మునగ, కరివేపాకు, బొప్పాయి, కర్ర పెండలం, రాగులు, సజ్జలు, నిమ్మ, మామిడి, కరివేపాకు, బొప్పాయి, చింతపండు తదితరాలతో పచ్చళ్లు, బిస్కెట్లు, చాక్లెట్లు తదితరాల తయారీపై శిక్షణ ఇచ్చామని కేవీకే గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త ఉమాజ్యోతి తెలిపారు.


విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త ఉమాజ్యోతి

పెండలంతో చిప్స్..: వర్షాకాలంలో అటవీ ప్రాంతంలో ఎక్కువగా లభించేది కర్ర పెండలం. పిండి వంటలు, జంతికలు, చకోడీలు తయారు చేస్తారు. వీటితో చేసే చిప్స్‌ను చిన్నారులు ఇష్టంగా తింటారు.



బొప్పాయితో టూటీ ఫ్రూటీ..

టూటీ ఫ్రూటీని ఎక్కువగా బేకరీ పదార్థాల్లో వినియోగిస్తారు. పచ్చి బొప్పాయితో దీన్ని తయారు చేస్తారు. దీన్ని పిల్లలు ఎక్కువగా తింటారు.




చిరుధాన్యాల బిస్కెట్లు

ప్రస్తుత తరుణంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఊదలు, సామలు, కొర్రలు, రాగులు వంటి చిరుధాన్యాలను భోజనంలో తీసుకునేందుకు చాలా మంది ఇష్టపడరు. వాటితో బిస్కెట్లు, మిక్చర్, జంతికలు, చాకెట్లు తయారు చేస్తే రుచికరంగా ఉంటాయి.



సీ విటమిన్ గుణాలెన్నో..

అటవీ ప్రాంతంలో కొన్ని కాలాల్లో మాత్రమే లభించేది వాక్కాయ. దీనిలో విటమిన్ 'సి' అధికంగా ఉంటుంది. ఎన్నో లాభాలు ఉంటాయి. దీంతో పచ్చడి తయారు చేసుకొని తింటే ఒంట్లో ఉన్న మలినాలు బయటకు పోతాయి.



సులభంగా జీర్ణం

వినడానికి వింతగా ఉన్నా చింతపండు చాక్లెట్‌లో ఎన్నో మంచి గుణాలు ఉంటాయి. భోజనం తర్వాత తింటే సులభంగా జీర్ణం అవుతుంది. మలబద్ధకం, మోకాళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. జ్వర బాధితులు తింటే ఆకలి పెరుగుతుంది.



సాలూరు అభివృద్ధికి రూ.30 కోట్లు

మెంటాడ, న్యూస్‌టుడే: సాలూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసినట్లు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఆండ్ర, లోతుగెడ్డలో పింఛను నగదు పంపిణీ చేశారు. పింఛన్ మొత్తం పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఇళ్ల నిర్మాణాలకు మూడేసి సెంట్ల స్థలాన్ని కేటాయించి, రూ.4 లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారు. అరకు పార్లమెంటు పరిధిలో పోడు వ్యవసాయం చేసే గిరిజన రైతులకు పట్టాలు ఇస్తామని చెప్పారు. ఈ సందర్భంగా లోతుగెడ్డ సర్పంచి భీమారావు, వార్డు సభ్యులు, ఆర్యవైశ్య సంఘాధ్యక్షుడు కె.సత్యనారాయణ, పలు కుటుంబాలు మంత్రి సమక్షంలో తెదేపాలో చేరారు. పార్టీ మండలాధ్యక్షుడు వెంకటరావు, అరకు పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు అన్నవరం పాల్గొన్నారు.


మంత్రి సంధ్యారాణి సమక్షంలో తెదేపాలో చేరిన సభ్యులు

పింఛన్ల పంపిణీ 97.17 శాతం

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మన్యంలో మంగళవారం రాత్రి 8 గంటలకు 1,42,393 మందికి గాను 1,38,365 (97.17 శాతం) మందికి పంపిణీ చేశారు. సంకేతాలు సరిగా అందకపోవడం, దూరభారం వెళ్లాల్సి రావడంతో కొంత జాప్యం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. పార్వతీపురంలో కలెక్టరు శ్యామ్‌ప్రసాద్, పుర కమిషనర్ శ్రీనివాస్ అందజేశారు.


అగ్రహారంలో పింఛను ఇస్తున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్

దివ్యాంగ పింఛన్ ఎలా వచ్చిందబ్బా



దివ్యాంగుల్లో అనర్హుల వడపోత ప్రారంభమైంది. గత వైకాపా ప్రభుత్వ పాలనలో కొంతమంది అర్హత లేకపోయినా.. రాజకీయ నాయకుల పలుకుబడితో దివ్యాంగుల జాబితాలో సామాజిక భద్రత పింఛను పొందారు. అందుకు నకిలీ ధ్రువపత్రాలు పొందారు. మరికొందరు దళారులను ఆశ్రయించి మానసికంగా, శారీరకంగా బాగున్నా.. వైకల్యం ఉన్నట్లు దొంగ పత్రాలు సృష్టించి దర్జాగా పొందుతున్నారు.

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దివ్యాంగ పింఛన్ రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచింది. జిల్లాలో రూ.10.20 కోట్లకు పైగా అందిస్తున్నారు. అంతే కాకుండా మంచానికి పరిమితం అయ్యే వారికి గతంలో రూ.5 వేలు ఇవ్వగా దానిని రూ.15 వేలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. ఇటువంటి తరుణంలో నకిలీలను వడపోసేందుకు అనుమానిత వ్యక్తుల జాబితాలను జిల్లాలకు పంపించి మళ్లీ ధ్రువీకరణ చేపట్టాలని ఆదేశించింది.

జిల్లాలో 15 మండలాల పరిధిలో 1.42 లక్షల మంది అన్ని రకాల పింఛనుదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ.59.37 కోట్లు పంపిణీ చేస్తున్నారు. ఇందులో దివ్యాంగులు 17,004 మంది ఉన్నారు. గత వైకాపా పాలనలో వైకల్యంతో బాధపడుతున్న వారికి నెలకు రూ.3 వేలు చొప్పున పంపిణీ చేసేవారు. ఇక్కడే అక్రమాలకు తెరలేపారు. నిబంధనలు తుంగలో తొక్కి కొంతమంది అడ్డగోలుగా అక్రమ మార్గంలో పొందాలని చూశారు. వైకాపా నాయకుల ఒత్తిడితో కొన్నిచోట్ల సదరం తప్పుడు ధ్రువపత్రాలు పుట్టించినట్లు ఆరోపణలు వచ్చాయి. వాటితో క్షేత్రస్థాయిలో వాలంటీర్ల ద్వారా ప్రతిపాదనలు వెళ్లడంతో నిజమే అని అధికారులు పింఛన్‌కు సిఫార్సు చేశారు. అయిదేళ్లూ అడిగే వారు లేక అంతా బాగున్న వారికి దివ్యాంగ పింఛన్ ఎలా వచ్చిందబ్బా అంటూ స్థానికులు చెవులు కొరుక్కున్నారు.


జిల్లా ఆసుపత్రిలో ఎదురుచూస్తున్న వైద్యులు

తొలి విడతలో 63 మంది

తొలి విడతగా జిల్లా ఆసుపత్రిలో 63 మందికి చెందిన ధ్రువపత్రాలు పరిశీలన చేయాలని జాబితా వచ్చింది. మండలాధికారులు ఆ జాబితా ప్రకారం గ్రామాల్లో ఉంటున్న లబ్ధిదారులకు సమాచారం ఇచ్చారు. అంతా ఒకసారి కాకుండా రోజుకి ఒక గ్రామం నుంచి వస్తే పరిశీలన చేస్తామని జిల్లా ఆసుపత్రి వైద్యులు సూచించారు. దాని ప్రకారం.. గరుగుబిల్లి మండలానికి చెందిన కొంత మందిని ధ్రువపత్రాలు పట్టుకొని మంగళవారం రావాలని చెప్పారు. ఆసుపత్రి వరకు కొందరు వచ్చి వెనుదిరిగారు. పరిశీలన కేంద్రంలో వైద్య నిపుణులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వేచి ఉన్నా ఎవరూ రాలేదు. కొన్ని గ్రామాల్లో భారీగా నకిలీ ధ్రువపత్రాలతో ఉన్నట్లు అనుమానిస్తున్నారు. పరిశీలన చేస్తే ఎక్కడ తమ బండారం బయట పడుతుందోనని ముఖం చాటేస్తున్నారు. జాబితాలో ఉన్నవారు అసలైన వారైతే పింఛన్‌కు ఢోకా ఉండదు.. భయంతో వెనుకంజ వేస్తే అసలు కోల్పోతారని వైద్యులు అంటున్నారు.

ఒకే ఒక్కరు వచ్చారు..

వైద్య ఆరోగ్య శాఖ నుంచి 63 మంది పేర్లతో జాబితా వచ్చింది. ప్రత్యేక సదరం శిబిరం ఏర్పాటు చేసి పరిశీలనకు ఏర్పాట్లు చేశాం. మంగళవారం 30 మందిని రమ్మంటే మధ్యాహ్నం వరకు ఎవరూ హాజరు కాలేదు. ఆఖరులో ఒకరు వచ్చారు.

- వాగ్దేవి, సూపరింటెండెంట్, జిల్లా ఆసుపత్రి

52 మద్యం దుకాణాలకు అవకాశం

పార్వతీపురం, న్యూస్‌టుడే: మద్యం కొత్త పాలసీలో భాగంగా ఈ నెల 11న దుకాణాలు కేటాయిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. పార్వతీపురం, పాలకొండ, కురుపాం, సాలూరు, సీతానగరం ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 52 దుకాణాలకు దరఖాస్తులు అవకాశం ఉందని చెప్పారు. ఈ నెల 3 నుంచి 9 వరకు దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో స్వీకరిస్తామన్నారు. దీంతో పాటు రూ.2 లక్షల రుసుము చెల్లించాలని సూచించారు. ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా ప్రతి స్టేషన్‌కు ప్రత్యేకాధికారిణి పర్యవేక్షణకు నియమిస్తామన్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనాథుడు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పనుల కోసం అవసరమైతే సంబంధిత శాఖలు ముందుగా కోరాలన్నారు. భామిని మండలం నేరడి వద్ద పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలని సూచించారు. జేసీ శోభిక, పాలకొండ సబ్ కలెక్టరు యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఏఎస్పీ దిలీప్‌కిరణ్, డీఆర్వో కేశవనాయుడు, గనులు, జల వనరులు, భూగర్భ జల శాఖ అధికారులు పాల్గొన్నారు.

పురిటి నొప్పులు.. డోలీ మోతలు


మంచంపై మోసుకెళ్తున్న స్థానికులు


ఆసుపత్రిలో గర్భిణి నిఖిత

ఏళ్లు గడుస్తున్నా గిరిజన ప్రజలకు డోలీ కష్టాలు తప్పడం లేదు. కొండలపై గ్రామాలకు చేరేందుకు సరైన రహదారులు లేక డోలీలను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలోని కొమరాడ మండలం చినఖేర్జిల పంచాయతీ సీసాడవలసకు చెందిన కొండగొర్రి నిఖితకు మంగళవారం పురిటి నొప్పులు వచ్చాయి. ఆశ కార్యకర్త 108కు సమాచారం ఇచ్చారు. కానీ రోడ్డు సౌకర్యం లేక వాహనం గ్రామానికి దూరంగా నిలిచిపోయింది. చేసేది లేక గర్భిణిని మంచంపై ఉంచి భర్త పారయ్య, స్థానికులు 500 మీటర్లు మోసి మైదాన ప్రాంతానికి చేర్చారు. అక్కడ నుంచి 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

– న్యూస్‌టుడే, కొమరాడ

భక్తులకు ప్రశాంత దర్శనం

ఉచిత అన్న ప్రసాదానికి ఏర్పాట్లు


అమ్మవారి ఆలయం నుంచి దర్శనాల అనంతరం బయటకు వచ్చేందుకు ఏర్పాటు చేస్తున్న మార్గం

పాలకొండ గ్రామీణం, పాలకొండ న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం కోటదుర్గమ్మ ఉత్సవాలకు ఈ ఏడాది వైభవాన్ని చాటేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్సవ కమిటీ పర్యవేక్షకుడు పల్లా కొండలరావు తెలిపారు. సామాన్య భక్తులు అమ్మవారిని ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఎటువంటి రాజకీయ ప్రకటనల హోర్డింగులకు అనుమతి లేదని, ఇప్పటికే ఉన్నవాటిని తొలగించి, అమ్మవారి చిత్రాలే ఉండేలా చూస్తామని చెప్పారు.

ఇప్పటికే క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు మజ్జిగ, తాగునీరు అందుబాటులో ఉంచుతామని కమిటీ తెలిపింది. కొత్తగా నిర్మించిన అన్న క్యాంటీన్ పక్కన అన్నదానానికి ఏర్పాటు చేశారు. ఇక్కడ రోజూ అయిదు వేల మందికి భోజనాలు పెట్టనున్నారు.

ఘటాలకు ప్రత్యేక మార్గం

అమ్మవారికి పట్టణంలోని అన్ని వీధుల నుంచి సామూహిక ఘటాలు తీసుకొస్తారు. భక్తులు పోస్టాఫీసు రహదారి నుంచి ఆలయానికి వచ్చే మార్గంలో రావాలని సూచిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సురభి కళాకారులతో ప్రదర్శనలు నిర్వహించనున్నారు.


దసరాకు ప్రత్యేక బస్సులు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా జిల్లాలోని పార్వతీపురం, పాలకొండ, సాలూరు ఆర్టీసీ డిపోల నుంచి హైదరాబాద్‌కు 10, విజయవాడ 20, రావులపాలెం 2 బస్సులు నడపనున్నట్లు జిల్లా ఇన్‌ఛార్జి ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 10 నుంచి 15 వరకు ప్రత్యేక బస్సులు తిరుగుతాయని చెప్పారు. మూడు డిపోల నుంచి 10 నుంచి 12 వరకు హైదరాబాద్‌కు రెండేసి చొప్పున 6 సర్వీసులు, 13, 14, 15 తేదీల్లో మరో 4 బస్సులు తిరుగుతాయని వివరించారు. విజయవాడకు 20 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. 11, 14న సాలూరు డిపో నుంచి రావులపాలేనికి ఒక్కో సర్వీసు వేశామన్నారు. విశాఖపట్నానికి 15 బస్సులు ఉంటాయని, రద్దీ ఎక్కువగా ఉంటే పెంచుతామని తెలియజేశారు.

భూచోళ్లు ఎందరో..

ఫ్రీహోల్డ్‌పై పునఃపరిశీలన

గతంలో పేదలకు ప్రభుత్వాలు పంపిణీ చేసిన అసైన్డ్ భూముల లావాదేవీలపై నిగ్గు తేల్చే దిశగా కూటమి సర్కారు అడుగులేస్తోంది. ఫ్రీహోల్డ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిన భూములకు సంబంధించి పునఃపరిశీలన జరపాలని ఆదేశించింది. భూములకు రెక్కలొచ్చిన మండలాల్లో వాటి తాజా పరిస్థితి తెలుసుకోవాలని పేర్కొంది. ప్రస్తుతం ఆ పనిలో ఉభయ జిల్లాల రెవెన్యూ యంత్రాంగం ఉంది.



విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే

భూముల్లేని పేదల జీవనోపాధికి గతంలో పంపిణీ చేసిన అసైన్డ్ భూములు ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉన్నాయి.. పట్టాదారు లేదా వారి సంతానం అనుభవిస్తుందా.. లేదా.. అమ్మకాలు జరిగితే ఎవరు కొనుగోలు చేశారనే కోణంలో ఆరా తీస్తున్నారు.

వైకాపా ప్రభుత్వం 20 ఏళ్లు గడిచిన అసైన్డ్ భూములపై హక్కులు కల్పించనున్నట్లు ప్రకటించింది. ఇందుకు అర్హత గల భూములను జిల్లాల వారీగా లెక్కలు తీసింది. విజయనగరం జిల్లాలో 5,618.36 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వగా 191 ఎకరాల రిజిస్ట్రేషన్ పూర్తయింది. పార్వతీపురం మన్యం జిల్లాలో 16,201.93 ఎకరాలకు 187 ఎకరాల్లో రిజిస్ట్రేషన్ జరిగింది.

దస్త్రాల తనిఖీ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా భూముల రిజిస్ట్రేషన్లు మూడు నెలల పాటు నిలిపివేయాలని ఆదేశించింది. వైకాపా పాలనలో జారీ చేసిన జీవో మేరకు నిబంధనలు ఏ మేరకు అమలయ్యాయి.. ఎక్కడైనా ఉల్లంఘించారా.. అప్పట్లో ఈ భూములపై వైకాపా పెద్దలు కన్నేసి గెద్దల్లా తన్నుకుపోయారని వెల్లువెత్తిన ఆరోపణల్లో వాస్తవం ఏమిటి.. వాటి తాజా పరిస్థితిపై మండల తహసీల్దార్ల నుంచి ప్రభుత్వం నివేదిక కోరింది. అప్పట్లో ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లు కొందరు మండల రెవెన్యూ అధికారులు నడుచుకున్నారు. ప్రస్తుతం కొన్ని మండలాల తహసీల్దార్లు, జేసీ స్థాయిలో లోతుగా పరిశీలించనున్నారు. ఆగస్టు నెలలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా విజయనగరం జిల్లాలో పర్యటించారు. భోగాపురం సహా పలు మండలాల్లో భూముల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి లోపాలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు.

జిల్లాలో 2003కు ముందు నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూములపై విజయనగరం కలెక్టరేట్‌లో మంగళవారం పునఃపరిశీలన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలుత క్షేత్రస్థాయిలో, తర్వాత కార్యాలయం స్థాయిలో పరిశీలన పూర్తి చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆదేశాలతో జిల్లాస్థాయిలో పునఃపరిశీలన నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఉభయ జిల్లాల్లో ఫ్రీహోల్డ్ చేసిన భూములకు సంబంధించి తహసీల్దారు కార్యాలయంలో దస్త్రాలు, కలెక్టరేట్‌లోని దస్త్రాలతో పోల్చి చూస్తున్నారు. దీన్ని బట్టి అధికారికంగా ఎన్ని ఉన్నాయి? అనధికారికంగా ఉన్నవి ఎన్నో తేల్చనున్నారు. ఈ విషయమై రెవెన్యూ శాఖ ఉన్నతాధికారి వద్ద 'ఈనాడు' ప్రస్తావించగా బుధవారం నాటికి దీనిపై స్పష్టత రానుందని బదులిచ్చారు.

హోరాహోరీగా పోటీలు



విద్యార్థులతో ప్రిన్సిపల్, పీడీలు

రాజాం, న్యూస్‌టుడే: డా. బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలకు రాజాం పట్టణంలోని జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇండోర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. పురుషుల విభాగంలో జీసీఎస్ఆర్ కళాశాల (రాజాం), డా. బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల), వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (ఎచ్చెర్ల) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. మహిళా విభాగంలో వెంకటేశ్వర ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల (ఎచ్చెర్ల), ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పాలకొండ), జీసీఎస్ఆర్ కళాశాల (రాజాం) తొలి మూడు స్థానాలు సాధించాయని జీసీఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ డా. ఎం. పురుషోత్తమరావు, పీడీ కేశవనారాయణ, యూనివర్సిటీ పీడీ ఎం. శ్రీనివాసరావులు తెలిపారు. జీఎంఆర్ ఐటీ పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో లక్ష్మికి ద్వితీయం



విజయనగరం క్రీడలు, న్యూస్‌టుడే: బిహార్‌లో గత నెల 28 నుంచి 30 వరకు జరిగిన జాతీయస్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించిన జిల్లాకు చెందిన జి. లక్ష్మి సత్తా చాటింది. 5.91 మీటర్ల లాంగ్ జంప్‌లో రజతం గెల్చుకుంది. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఈమె జాతీయస్థాయి అథ్లెట్లలో ఒకరిగా నిలుస్తోంది. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గం మంగళవారం రాత్రి హర్షం వ్యక్తం చేసింది.

అద్భుతం.. ఆదివాసీ చిత్రలేఖనం



శిక్షణార్థులు వేసిన వివిధ చిత్రాలు

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేటలో లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ (ఆంధ్రప్రదేశ్ హస్తకళ అభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో ఆదివాసీలకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. కనుమరుగవుతున్న గిరిజన చిత్రలేఖన కళకు జీవం పోసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది. ఈ నేపథ్యంలో విశాఖపట్నానికి చెందిన లేపాక్షి సిబ్బంది గత రెండు నెలలుగా డిజైన్ డెవలప్‌మెంట్ కార్యశాల, సవర ఆదివాసీ చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. వారి జీవనపాధి కోసం మార్కెట్ సదుపాయం ఈ సంస్థ కల్పిస్తోంది. మాస్టర్ ఎ. శేషగిరి, 20 మంది కళాకారుల బృందం డిమాండ్ ఉన్న 100 వరకు ఉత్పత్తులను రూపొందించారు.

అన్నదమ్ములు.. 'అగ్నివీర్'లు

ఒకే ఎంపికలో ఉద్యోగాలు


ప్రసాద్, రామునాయుడు సోదరులు


సాయికార్తీక్

గజపతినగరం, న్యూస్‌టుడే: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రక్షణ శాఖ అగ్నివీర్ ఉద్యోగాలకు ఇద్దరు అన్నదమ్ములు ఒకేసారి ఎంపికయ్యారు. మరో వారం రోజుల్లో శిక్షణకు హాజరు కాబోతున్నారు. పాతబగ్గాం గ్రామానికి చెందిన రైతు కుమిలి అప్పలనాయుడు, సత్యవతి దంపతులకు ప్రసాద్, రామునాయుడు కుమారులు. వీరు ఆగస్టు నెలలో విశాఖలో నిర్వహించిన అగ్నివీర్ ఉద్యోగావకాశాల్లో జనరల్ డ్యూటీ (జీడీ) విభాగానికి ఎంపికలకు వెళ్లారు. అన్ని శారీరక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. అనంతరం ధ్రువపత్రాల ఎంపికలు జరిగాయి. ఉద్యోగాలకు ఎంపికైనట్లు వర్తమానాలు అందాయి. ఆ కుటుంబం ఆనందానికి అవధులు లేవు. చదువుతుండగానే కుమారులకు ఉద్యోగాలు రావడం పట్ల కన్నవారు సంతోషం వ్యక్తం చేశారు. ప్రసాద్ డిగ్రీ పూర్తి చేయగా బెంగళూరు కేంద్రంలో 8 నెలల శిక్షణకు హాజరు కావాలని ఉత్తర్వులు అందాయి. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న రామునాయుడు నాసిక్‌లో శిక్షణకు ఎంపికయ్యాడు. వీరిని గ్రామ సర్పంచి లెంక చిన్నంనాయుడు, పెద్దలు అభినందించారు.

దావాలపేట నుంచి ఒకరు..

గజపతినగరం మండలం దావాలపేటకు చెందిన తాయిల సాయికార్తీక్ డిగ్రీ చదివి అగ్నివీర్ ఉద్యోగ ఎంపికకు వెళ్లగా జీడీ విభాగానికి ఎంపికయ్యారు. ఇతనిది నిరుపేద కుటుంబం. తండ్రి ఆదినారాయణ, తల్లి కృష్ణవేణి కూలీలు. కుమారుడికి ఉద్యోగం రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. మండలానికి చెందిన పోలినాటి శ్రీనివాస్, కొండమ్మ దంపతుల కుమారుడు వివేక్ అగ్నివీర్ ఉద్యోగంలో జీడీ విభాగానికి ఎంపికయ్యారు. ఈయన డిగ్రీ చదివి ఒకేసారి ఎంపికకు వెళ్లి ఉద్యోగవకాశాన్ని పొందగలిగారు.

కేజీబీవీ దరఖాస్తుల్లో..

సాంకేతిక సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: కేజీబీవీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసేందుకు గత నెల 26 నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల పదోతేదీ వరకు అవకాశముంది. దరఖాస్తు చేసే సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తితే వాటిని పరిష్కరించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. జిల్లాలో సమగ్ర శిక్షా కార్యాలయంలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు డీఈవో ఎన్. ప్రేమకుమార్ తెలిపారు. అయిదుగురు అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో 70750 39990, 70751 59996 టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించవచ్చన్నారు. జిల్లా స్థాయి కంట్రోల్ రూం అధికారులు, సంప్రదించాల్సిన చరవాణి నంబర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

అధికారి	చరవాణి నంబరు
జీసీడీవో	90002 04925
పర్యవేక్షకుడు	94944 65684
ఏఎస్‌వో	97013 60225
ఏజీసీడీవో	80745 51455
సహాయ సీఎంవో	89854 95098

ఉపాధి హామీలో అవినీతిని అరికట్టండి


డ్వామా పీడీ సందీప్‌తో మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జి


విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: జిల్లాలో ఉపాధి హామీ పథకంలో అవినీతిని అరికట్టి ప్రజలకు, ప్రభుత్వానికి ఉపయోగపడేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డ్వామా పీడీ సందీప్‌ను కోరారు. మంగళవారం పీడీని కలిసి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు ఆసరాగా ఉండేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం ఉద్యోగులకు, గ్రామాల్లో ఆర్థిక పరిపుష్టి ఉన్నవారికి ఉపయోగపడుతోందని తెలిపారు. పలు మండలాల్లో ఒక్కో వేతనదారుడి నుంచి రూ.100 వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. నూతన పీడీగా బాధ్యతలు స్వీకరించిన సందీప్‌ను పౌరవేదిక ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో గోపాలరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు పోతన్న పాల్గొన్నారు.

మహాత్ముడి మార్గంలో... మనమెక్కడ?

ఈనాడు-విజయనగరం, న్యూస్‌టుడే-గరివిడి, చీపురుపల్లి గ్రామీణం

జాతిపిత మహాత్మా గాంధీ కాలంతో ప్రయాణించే మహనీయుడు.. ఆధునిక సమాజానికి స్ఫూర్తి దాయకం.. నేడు బాపూ జయంతి సందర్భంగా ఆయన ఆశయాల ఆచరణలో మనం ఎక్కడ ఉన్నామన్నది మననం చేసుకుందాం. కొన్నింటిని ఉమ్మడి జిల్లాకు అన్వయించుకుని తరచి చూదాం.. వాటి అమలుకు ఇంకా ఏమి చేస్తే బాగుంటుందో పరిశీలిద్దాం.

అక్షరమే ప్రగతి కిరణం



అక్షర జ్ఞానం అద్భుత ప్రగతికి మార్గమన్నారు బాపూ. ఉమ్మడి విజయనగరం జిల్లాలో అక్షరాస్యతలో వెనుకబాటు కొనసాగుతోంది. 2001, 2011 గణాంకాలు చూస్తే పురుషుల్లో 62.37, మహిళల్లో 49.87 శాతం అక్షరాస్యులే ఉన్నారు. ఈ పుష్కర కాలంలో కాస్త పెరిగే అవకాశముంది. అక్షర జ్ఞానం పది మందికి పంచితే అక్షరాస్యత శాతం పెరుగుతుంది.

గ్రామస్వరాజ్యం




సహజ వనరుల వినియోగంతోనే పల్లెల ప్రగతి అన్నది 'గ్రామ స్వరాజ్యంలో నా సలహా' అనే పుస్తకంలో గాంధీజీ పేర్కొన్నారు. అయిదేళ్ల వైకాపా పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ చిన్నాభిన్నమైంది. సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చి నిధులను దారి మళ్లించడంతో ప్రగతి జాడలు కనుమరుగయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్రం ఇచ్చిన రూ.56 కోట్లను పంచాయతీల ఖాతాలకు జమ చేసింది.

స్వయం ఉపాధి

అందరికీ పని దొరకాలంటే స్వయం ఉపాధి పథకాలే కీలకమని జాతిపిత మాట. వెలుగు ఆధ్వర్యంలో రుణాలు పొంది మహిళలు వృత్తి, వ్యక్తిగత వ్యాపారాల్లో రాణిస్తున్నారు. డ్వాక్రా సంఘాల్లోని 7.35 లక్షల మంది సుమారు రూ.వెయ్యి కోట్లకు పైగా పొదుపు చేశారు. చీపురుపల్లి మండలం అలకనారాయణపురం శ్రీమహాలక్ష్మి ఎంపీఎస్‌కు జాతీయ పురస్కారం లభించింది. మిగిలిన సంఘాలు వీరి బాటలో నడిస్తే గ్రామాలు స్వయం పోషకంగా మారతాయి.



శుభ్రతే ఆరోగ్యదాయం



పరిశుభ్రతే ఆరోగ్యానికి ఆలవాలం అన్నది బాపూజీ సూచన. దీని స్ఫూర్తితో కేంద్రం అమలు చేస్తున్న స్వచ్ఛభారత్ కార్యక్రమంలో చీపురుపల్లి మండలం కర్లాం, సీతానగరం మండలం పెదభోగిలి చెత్త నుంచి సంపద తయారీలో అగ్రగామిగా నిలిచాయి. అయిదేళ్ల వైకాపా పాలన స్వచ్ఛతకు పాతరేసింది. తెదేపా హయాంలో నెలకొల్పిన 895 సంపద కేంద్రాలు ఇటీవల వరకు నిరుపయోగంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వాటిని మళ్లీ వినియోగంలోకి తీసుకొచ్చి స్వచ్ఛత సాధనకు చర్యలు చేపట్టింది.

విజ్ఞాన సుగంధాలు



ఉభయ జిల్లాల్లోని 41 ప్రభుత్వ గ్రంథాలయాల్లో ఒకటి, రెండు తప్ప మిగిలినవన్నీ నిర్వహణ కొరవడి కునారిల్లుతున్నాయి. ఏటా రూ.6 కోట్లు గ్రాంట్-ఇన్-ఎయిడ్ ఇవ్వాలి. వైకాపా ప్రభుత్వం రూ.24 కోట్లకు బదులు రూ.3.50 కోట్లు మాత్రమే ఇచ్చింది. 2017 నుంచి నగరపాలక సంస్థ రూ.1.50 కోట్లు, పురపాలక సంఘాల నుంచి రూ.కోటి, పంచాయతీల నుంచి రూ.3.45 కోట్లు జిల్లా గ్రంథాలయ సంస్థకు రావలసి ఉంది.

క్రీడాభివృద్ధికి ఐటీడీఏ కృషి


రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థిని లక్షిత

సీతంపేట, న్యూస్‌టుడే: ఐటీడీఏ ద్వారా క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఏపీవో జి. చిన్నబాబు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి విలువిద్య (ఆర్చరీ) ఎంపికలు ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ మైదానంలో నిర్వహించారు. క్రీడలతో మానసిక ప్రశాంతత, చురుకుదనం కలుగుతుందన్నారు. అండర్ 14, 17, 19 విభాగాల్లో 150 మంది క్రీడాకారులు హాజరవ్వగా, 68 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డీడీ ఎం. అన్నాదొర, ఎంపీడీవో కె. గీతాంజలి, స్పోర్ట్సు ఇన్‌ఛార్జి ఎన్. జాకోబ్ దయానందం, ఏఎంవో పి. కోటిబాబు, జీసీడీవో రాములమ్మ, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం. వెంకటరావు, బి.వి. రమణమూర్తి, కె. రవి, వై. శేఖర్ పాల్గొన్నారు.


సీతంపేటలో మాట్లాడుతున్న ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి చిన్నబాబు

ఆంధ్రా చదరంగ సంఘం సీఈవోగా జ్వాలాముఖి

విజయనగరం క్రీడలు, న్యూస్‌టుడే: అఖిల భారత చదరంగ సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ క్రీడా అధీకృత సంస్థ వారి సమక్షంలో నిర్వహించిన ఆంధ్రా చదరంగ సంఘం ఎన్నికల్లో కొత్త కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సమాఖ్య తరఫున పరిశీలకుడిగా అంకుష్ (సంయుక్త కార్యదర్శి, మహారాష్ట్ర), శాప్ తరఫున ఎస్ఏ అజిత్ (డీఎస్‌డీవో, ఎన్టీఆర్ జిల్లా) పర్యవేక్షణలో ఈ ఎన్నికలు నిర్వహించారు. విజయనగరం జిల్లాకు చెందిన కేవీ జ్వాలాముఖి ఆంధ్రా చెస్ అసోసియేషన్ సీఈవోగా, కోశాధికారిగా కేకే జగన్నాథ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అదనపు ఎస్పీగా సౌమ్యలత


ఎస్పీ వకుల్ జిందాల్‌తో అదనపు ఎస్పీ

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లా అదనపు (అడ్మిన్) ఎస్పీగా పి. సౌమ్యలత మంగళవారం పోలీసు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పోలీసు కార్యాలయ పనితీరును పర్యవేక్షించాలని, డీజీపీ కార్యాలయం, రేంజ్ పోలీసు కార్యాలయాలతో జరపాల్సిన ఉత్తర ప్రత్యుత్తరాల్లో కాలయాపన లేకుండా చూడాలని ఎస్పీ ఆదేశించారు. డీఎస్పీగా ఎంపికైన సౌమ్యలత గతంలో బొబ్బిలి, ఇంటెలిజెన్సు, అనిశా విభాగాల్లో పనిచేశారు. అదనపు ఎస్పీకి పలువురు పూలమొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన బొబ్బిలి మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కొండదేవుపల్లికి చెందిన ఆర్. కృష్ణప్ప(55) మంగళవారం సాయంత్రం పొలం నుంచి తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఇనుప బొరిగే భుజంపై పెట్టుకుని గట్టుపై నడుస్తుండగా కింద వేలాడుతున్న విద్యుత్తు తీగలు దానికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. సమీపంలోని రైతులు విద్యుత్తుశాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఏఈ సాంబశివరావు పరిశీలించి, ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు చెప్పారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలున్నారు.

మలేరియా లక్షణాలతో విద్యార్థిని మృతి

కొమరాడ, న్యూస్‌టుడే: మలేరియా లక్షణాలతో విద్యార్థిని మృతి చెందిన ఘటన మన్యంలో చోటు చేసుకుంది. కొమరాడ కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న జాకూరు గ్రామానికి చెందిన కద్రక శారద (14) ఇటీవల జ్వరం బారిన పడింది. గత నెల 25న వైద్య పరీక్షలు చేయించగా మలేరియా, టైఫాయిడ్ లక్షణాలు కనిపించాయి. తర్వాత రోజు పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షల అనంతరం కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. చికిత్స అందిస్తుండగా మంగళవారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని తల్లిదండ్రులు దామిని, నరసింహులు తెలిపారు. వీరికి శారద ఆరో సంతానం. ఘటనపై ఎస్‌వో అరుణ వద్ద ప్రస్తావించగా.. మలేరియా అని తెలిసిన తర్వాత వైద్యుల సూచన మేరకు విశాఖ తరలించామని తెలిపారు.

పాముకాటుతో మహిళ మృత్యువాత

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: పాముకాటుతో మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని చందులూరు గ్రామంలో చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్ల సూర్యం (60) సోమవారం రాత్రి పనులు ముగించుకొని పడుకున్నారు. అర్ధరాత్రి సమయంలో ఇంటి పైకప్పు మీద నుంచి ఆమె నిద్రిస్తున్న మంచంపై పాము పడింది. నిద్రలో కదులుతున్న సమయంలో చేతిపై కాటేసింది. గమనించి కుటుంబ సభ్యులకు చెప్పడంతో ఎస్. కోట ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందింది.

ఇంట్లో చొరబడి.. దాడి చేసి..

చెముడు(మక్కువ), న్యూస్‌టుడే: మక్కువ మండలం చెముడు గ్రామానికి చెందిన గొట్టాపు మనోహర్‌రావు ఆయన సోదరుడు కృష్ణమోహన్‌పై విశాఖపట్నానికి చెందిన ఓ మహిళతో పాటు ఆరుగురు వ్యక్తులు దాడి చేశారు. మంగళవారం మధ్యాహ్నం రెండు కార్లలో చెముడు చేరుకుని మనోహర్‌రావు ఇంట్లోకి చొరబడి కర్రలతో దాడిచేశారు. అడ్డుకున్న ఆయన సోదరుడు కృష్ణమోహన్‌పై కూడా దాడికి తెగబడి ఇంట్లో ఉన్న సామగ్రిని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేశారు. గాయపడినవారిని శంబర పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అక్కడి నుంచి సాలూరు తరలించారు. దాడి ఎందుకు చేశారో? అనే విషయం దర్యాప్తులో తేలనుంది.

14 కిలోల గంజాయి పట్టివేత

పాచిపెంట, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి విశాఖపట్నానికి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నట్లు పాచిపెంట ఎస్సై వెంకటసురేష్ తెలిపారు. ఆయన వివరాలు ప్రకారం.. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి ఒడిశాకు చెందిన మరో ఇద్దరు మహిళలతో అక్రమంగా గంజాయి తరలిస్తుండగా పి. కోనవలస సమీపంలో సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 14.50 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరు పరిచి మంగళవారం రిమాండుకు తరలించారు.

అత్యాచారం కేసులో 22 ఏళ్ల జైలు

విజయనగరం న్యాయవార్తావిభాగం, న్యూస్‌టుడే: ఒంటరిగా ఇంట్లో ఉన్న మహిళపై అత్యాచారానికి పాల్పడిన నేరానికి బొబ్బిలి పట్టణానికి చెందిన డి. రమేశ్‌కు అయిదో అదనపు జిల్లా న్యాయస్థానం 22 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెలువడింది. వివరాలిలా ఉన్నాయి.. నిందితుడు అదే ప్రాంతానికి చెందిన తనపై 2020లో అత్యాచారానికి పాల్పడినట్లు బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొబ్బిలి పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి న్యాయస్థానంలో అభియోగపత్రాన్ని దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయస్థానం నిందితుడు రమేశ్ అత్యాచారానికి పాల్పడినట్లు తేలడంతో 22 ఏళ్ల జైలు శిక్ష విధించింది.

కొత్త తరానికి పురాతన కళలు పరిచయం


వీణ చరిత్రను వివరిస్తున్న లేపాక్షి ప్రబంధకుడు కార్తీక్

బొబ్బిలి, న్యూస్‌టుడే: నేటి తరానికి పురాతన కళలు పరిచయం చేసేందుకు హస్తకళల అభివృద్ధి సంస్థ ప్రత్యేక కార్యాచరణను రూపొందించిందని లేపాక్షి విశాఖ ప్రాంతీయ ప్రబంధకుడు కె. కార్తీక్ అన్నారు. బొబ్బిలి వీణల కేంద్రంలో హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రెండు నెలలుగా 20 మంది కళాకారులకు వీణల తయారీలో అధునాతన మెలకువలపై శిక్షణ ఇచ్చారు. మంగళవారం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఇటీవల 'సవర ఆదివాసీ చిత్రలేఖనం'పై గిరిజన యువతకు, ఔత్సాహికులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. బొబ్బిలి వీణకు ఉన్న డిమాండుకు తగ్గ తయారీ లేదని, అందుకే ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నామని చెప్పారు. ఏటికొప్పాక బొమ్మలకు గుర్తింపు ఉందని, దీనిపై ఔత్సాహికులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. పురపాలక అధ్యక్షుడు ఎస్. వెంకట మురళీకృష్ణారావు, కమిషనర్ రామలక్ష్మి, కేంద్రం ఇన్‌ఛార్జి సర్వసిద్ధి రామకృష్ణ, వార్డు కౌన్సిలర్ గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పొందిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

నేడు గాంధీ జయంతి వేడుకలు


విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా, మండల స్థాయిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించాలని కలెక్టర్ డా. బి.ఆర్. అంబేడ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం ఉదయం 8.30 గంటలకు జయంత్యుత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	118	206	216

ఉపాధి పనుల్లో అక్రమాలకు చెక్





చరవాణిలో యాప్ ముఖ చిత్రం

న్యూస్‌టుడే, కలెక్టరేట్ ప్రాంగణం, కొత్తవలస

- యాప్ అందుబాటులోకి తెచ్చిన కేంద్రం
- సమగ్ర వివరాలు అందులోనే

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారుల వివరాలు ఇకపై యాప్‌లో భద్రంగా ఉండనున్నాయి. దీని కోసం కేంద్రం జనమన్‌రేగా యాప్ అందుబాటులోకి తీసుకొచ్చింది. పనికి సంబంధించిన సమగ్ర వివరాలు అందుబాటులో ఉంటాయి.

ఎన్నో లాభాలు

జన్‌మన్ రేగా యాప్‌లో వేతనదారుల సమాచారం, హాజరు, వేతనాల వివరాలు ఉంటాయి. రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ, జాబ్ కార్డు సంఖ్య నమోదు చేసి బటన్ నొక్కితే వివరాలు ప్రత్యక్షమవుతాయి. కూలీ పేరు క్లిక్ చేస్తే పని చేసిన రోజులు, నగదు మొత్తం, ఏ బ్యాంక్ ఖాతాలో జమ అయ్యిందో తెలుస్తాయి. నగదు జమ కాకపోతే ఎందుకు కాలేదో కారణాలు కనిపిస్తాయి. గతంలో ఈ వివరాల కోసం లబ్ధిదారులు ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది.

ఫిర్యాదుకు అవకాశం

ఉపాధి హామీ పథకంలో పనికి తగిన వేతనం పడకపోయినా, సంబంధిత ఉద్యోగులు అక్రమాలు, అవినీతికి పాల్పడినా యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో పని చేయించినా, సిబ్బంది బిల్లుల చెల్లింపులో ఇబ్బంది పెట్టినా అధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చు. ఈ వివరాలన్నీ ఆయా భాషల్లో అందుబాటులో ఉంటాయి.

అవినీతి తగ్గుతుంది

ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఉపాధి హామీ పథకంలో పారదర్శకత ఉండాలనే ఉద్దేశంతో కేంద్రం ఈ యాప్‌ను రూపొందించింది. జన్‌మన్‌రేగా యాప్‌పై గ్రామాల్లో అవగాహన కల్పిస్తాం. వేతనదారులకు చరవాణిలుంటే యాప్ డౌన్‌లోడ్ చేయిస్తాం. శ్రామికుల్లో చైతన్యం వస్తే పనుల్లో అవినీతి తగ్గుతుంది.

– పి. రామచంద్రరావు, డ్వామా పీడీ

ఉభయ జిల్లాల్లో జాబ్‌కార్డులు, హాజరవుతున్నవారు..

జిల్లా	దరఖాస్తులు	ఇచ్చినవి	మనుగడలో ఉన్నవి	వేతనదారులు	హాజరవుతున్న వారు
విజయనగరం	3,83,695	3,82,984	3,51,810	6,85,511	5,92,881
పార్వతీపురం మన్యం	2,08,853	2,08,256	1,92,525	3,95,572	3,51,271

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? విద్యుత్తు నియంత్రిక మరమ్మతులకు గురవడంతో నీరు లేక వరి పంట ఎండిపోతోంది. **- ఎం.శ్రీనివాసరావు, రైతు**

❖ సమస్యను గుర్తించాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. **- సురేష్, లైన్‌మ్యాన్,** – న్యూస్‌టుడే, మక్కువ

? టీకేరాజపురం కూడలిలోని బోరు పనిచేయడం లేదు. **- రాము, ఉద్యోగి**

❖ సిబ్బందితో బోరు బాగుచేయిస్తాం. **- ఉమామహేశ్వరి, ఎంపీడీవో** – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

? లక్ష్మీపురం ప్రధాన వీధిలో కుళాయి పాయింట్లు పూర్తి స్థాయిలో లేవు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. **- వెంకటరమణ**

❖ అవసరాల మేరకు కొత్త పాయింట్లు వేస్తాం. **- పవన్‌కుమార్, ఏఈ, నీటిసరఫరా విభాగం** – న్యూస్‌టుడే, సీతానగరం

? మొండెంఖల్లు నుంచి నీలకంఠాపురం వెళ్లే మార్గంలో క్లైరసాపురం వద్ద రహదారి అంచున గుంత ఏర్పడింది. **- రామకృష్ణ**

❖ పరిశీలించి గుంత పూడుస్తాం. **- ర.భ. శాఖ అధికారులు** – కురుపాం గ్రామీణం

గుంతల పూడ్చివేత

సీతానగరం, న్యూస్‌టుడే: మండలంలోని అప్పయ్యపేటలో ప్రధాన రహదారి పక్కన విద్యుత్తు స్తంభాల కోసం గుంతలు తవ్వి వదిలేశారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గత నెల 27న ఈనాడు 'మేమున్నాం.. మీకు తోడుగా'లో స్థానికులు తెలియజేశారు. వార్త ప్రచురించగా విద్యుత్తు శాఖ ఏఈ జగన్‌మోహనరావు స్పందించారు. గుత్తేదారుతో మాట్లాడి గుంతలను పూడ్చారు.

చెత్త సమస్య పరిష్కారం

స్పందనకు వందనం

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న చెత్తను ఎట్టకేలకు తొలగించారు. ఇక్కడ రెండు నెలలుగా వేయడంతో గుట్టలుగా పేరుకుపోయాయి. సమస్యపై పలుమార్లు 'ఈనాడు'లో వార్తలు ప్రచురితం అయ్యాయి. మంగళవారం పరిసరాలు శుభ్రం చేశారు.

ఇసుక లేక ఇబ్బందులు



ఇసుక లేకపోవడంతో కూలీలు, భవన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని సిటు జిల్లా కార్యదర్శి మన్మథరావు అన్నారు. ఇసుక పాలసీ ప్రకటించాలని కలెక్టరేట్ ముందు మంగళవారం దీక్ష చేపట్టారు. 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న నాగావళిని కాదని, 100 కిలోమీటర్ల దూరంలోని వంశధారలో రేవు గుర్తించడం ఏంటని ప్రశ్నించారు. భామిని నుంచి పార్వతీపురం తీసుకురావాలంటే రూ.7 వేలు అవుతుందన్నారు. సిటు నాయకులు వెంకటరమణ, ట్రాక్టర్ యజమానులు, కార్మికులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, కలెక్టరేట్ ప్రాంగణం**

అటు మురుగు.. ఇటు బోధన



సాలూరు మండలంలోని నెలపర్తి పంచాయతీ దుగ్ధసాగరం ప్రాథమిక పాఠశాల ముందు మురుగు నిలిచిపోతోంది. ఇక్కడి నుంచి కిందికి కాలువ లేకపోవడంతో గ్రామంలోని వాడుక నీరు ఆగిపోతోంది. పారిశుద్ధ్య సిబ్బంది కాలువలు శుభ్రం చేసిన రెండు, మూడు రోజుల తర్వాత ఇదే పరిస్థితి ఏర్పడుతోంది. మురుగుకూపం ఆవరణలోనే పాఠాలు బోధిస్తున్నారని, వ్యాధులబారిన పడే ప్రమాదం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనిపై కార్యదర్శి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇంకుడు గుంత నిర్మాణానికి ప్రతిపాదించామన్నారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

సేవ, చదువు అవసరం

విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు సేవా దృక్పథం అలవర్చుకోవాలని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీవరం సూచించారు. మంగళవారం ర్యాలీ, మానవహారం నిర్వహించి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు రామయ్య, త్రినాథ్, విద్యార్థులు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం



నాణ్యమైన బోధన..
సౌకర్యాల కల్పన..


● గురుకులాల్లో ముమ్మరంగా సర్వే
● త్వరలో విద్యార్థుల కష్టాలకు చెల్లు



గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: నాడు- నేడు పథకంలో ప్రభుత్వ విద్యా సంస్థల రూపురేఖలు మారుస్తామని చెప్పిన గత ప్రభుత్వం హామీలు గాలికొదిలేసింది. దీంతో అయిదేళ్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ గురుకులాల్లో చదివిన వారి పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. ప్రస్తుత ప్రభుత్వం వీరి నాణ్యమైన బోధనతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కార్యాచరణ అమలు చేస్తోంది.

అయిదేళ్లు కష్టాలే..

జిల్లాలోని 23 గురుకులాల్లో సుమారు 7,700 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి సరిపడా గదులు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఎన్నో అవస్థలు పడ్డారు.



పీటీజీలో పెచ్చులూడిన పైకప్పు

గతంలో మంచాలు అందజేసినా గదులు సరిపోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. భోజనశాలలు లేక ఆరుబయట, వరండాల్లో తినాల్సిన దుస్థితి. కొన్ని చోట్ల గురుకులాలలో రక్షణ గోడలు లేక విష కీటకాలు, జంతువులు వచ్చిన ఘటనలు నెలకొన్నాయి. అయిదేళ్లు క్రీడాపరికరాలకు విద్యార్థులు దూరమయ్యారు.

తొలిసారి వివరాల సేకరణ..

గురుకులాల్లో సౌకర్యాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాకు ఒకరి చొప్పున టాస్క్‌ఫోర్స్ అధికారిని నియమించి సర్వే చేపడుతోంది. దీనిలో విద్యార్థుల ఆరోగ్యం, వంటల జాబితా అమలు, భోజనాల నాణ్యత, మరుగుదొడ్లు, నీటి సౌకర్యం, తరగతి గదులు, రక్షణ గోడలు, ప్రయోగశాలలు, పారిశుద్ధ్యం, బోధకులు, బోధనేతర సిబ్బంది, కాపలాదారుల వివరాలు సేకరిస్తున్నారు. గతంలో నిధుల మంజూరైతే చేసిన ఖర్చు, మిగిలిన నగదు వివరాలు ఆరా తీస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదికలు..

గురుకులాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం టాస్క్‌ఫోర్స్ అధికారులు సర్వే చేస్తున్నారు. స్వయంగా విద్యా సంస్థలను తనిఖీ చేసి సమస్యలు గుర్తిస్తున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నారు. – ధర్మరాజు, గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ ప్రిన్సిపల్

రాజకీయ ఒత్తిళ్లు సరికాదు

పార్వతీపురం మండలం రావికోనకు చెందిన వీవోఏ కన్యాకుమారిని అకారణంగా తొలగించారని, ఆమెను కొనసాగించాలని గ్రామస్థులు కలెక్టరేట్ ముందు ఆందోళన చేపట్టారు. సర్పంచి కె.రామస్వామి, సిటు నాయకురాలు ఇందిర ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. రాజకీయ ఒత్తిళ్లతో తొలగింపులు సరికాదన్నారు. - న్యూస్‌టుడే, పార్వతీపురం



గోడప్రతుల ఆవిష్కరణ

విజయనగరంలో ఈ నెల 6, 7, 8వ తేదీల్లో జరగనున్న ఏపీటీఎఫ్ 20వ విద్యా, వైజ్ఞానిక మహాసభలు విజయవంతం చేయాలని సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ధనుంజయరావు, శేషగిరిరావు కోరారు. బలిజిపేటలో సంబంధిత కరప్రతులు విడుదల చేశారు. – న్యూస్‌టుడే, బలిజిపేట



చోదకులకు అవగాహన

వాహనదారులు విధిగా నిబంధనలు పాటించాలని ఎస్సై నీలకంఠరావు సూచించారు. మంగళవారం నీలకంఠాపురంలో ఆటో, ద్విచక్ర వాహన చోదకులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. అధిక సంఖ్యలో ప్రయాణికులతో వెళ్తే చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం



బదిలీలు నిలపాలని డిమాండు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోల అంతర్‌జిల్లాల బదిలీలు నిలుపుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డిమాండు చేశారు. ఏజెన్సీలో గిరిజనులే పని చేయాలని జీవోలు ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు పునరాలోచన చేయాలని కోరారు. నాయకులు చంద్రశేఖర్, సురేష్, రామకృష్ణ, భగవాన్, హరికృష్ణ, సోములు ఉన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: బెలగాం ప్రాంతంలో సాంకేతిక పనుల్లో భాగంగా విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ మురళీధర్ తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి ఒంటి గంట వరకు సౌందర్య సినిమా హాలు రహదారి, గణేష్ నగర్, చర్చివీధి, ఎల్ఐసీ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

మర్యాద పూర్వక కలయిక

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని ట్రైకార్ సభ్యురాలు పువ్వల లావణ్య మంగళవారం సాలూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. కురుపాం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, ఇతర అంశాలపై చర్చించినట్లు తెలిపారు.

ఉపాధి పనులపై గ్రామ సభలు

భామిని, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్వహించే ప్రత్యేక గ్రామసభలు విజయవంతం చేయాలని పాలకొండ డీఎల్‌డీవో గోపాలకృష్ణ అన్నారు. భామిని జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద బుధవారం జరగనున్న సమావేశంపై అధికారులను అప్రమత్తం చేశారు. గ్రామాల్లో నరేగా నిధులతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ❖ **వీరఘట్టం:** పంచాయతీ కేంద్రాల్లో బుధవారం నిర్వహించనున్న గ్రామసభల్లో 78 రకాల పనులు గుర్తించాలని ఉపాధి హామీ ఏపీడీ జి.శ్రీహరిరావు తెలిపారు. నరేగా కార్యాలయంలో సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశమయ్యారు. వ్యవసాయం, అనుబంధ పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

22న ఎన్నికలకు ఏర్పాట్లు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గిరిజన సహకార మార్కెటింగ్ సంఘానికి ఎన్నికలు నిర్వహించనున్నట్లు కో-ఆపరేటివ్ సబ్ డివిజనల్ అధికారి కార్యాలయం తెలిపింది. ఈ నెల 14న నామినేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని, 15న పరిశీలన, 16న ఉపసంహరణ, 22న ఎన్నికలు నిర్వహిస్తామని సిబ్బంది చెప్పారు.



సాలూరు పట్టణంలో వృద్ధురాలికి ఫించను అందిస్తున్న మంత్రి సంధ్యారాణి



జేకేపాడులో నగదు ఇస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి



నర్సిపురంలో ఎమ్మెల్యే విజయచంద్ర ఆధ్వర్యంలో..

పేదల సంక్షేమమే ధ్యేయం

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని మంత్రి సంధ్యారాణి పేర్కొన్నారు. సాలూరు పట్టణంలోని 26వ వార్డులో వృద్ధులకు ఫించన్ల సొమ్ము పంపిణీ చేశారు. ❖ **గుమ్మలక్ష్మీపురం:** పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే టి.జగదీశ్వరి అన్నారు. జేకేపాడులో పింఛన్లు పంపిణీ చేశారు. ❖ **పార్వతీపురం గ్రామీణం:** మండలంలోని నర్సిపురం తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే విజయచంద్ర పర్యటించి ఇంటింటికీ వెళ్లి పింఛన్ల నగదు అందజేశారు.

27న జిల్లాస్థాయి చెకుముకి పోటీలు



పరీక్ష పత్రాలు ఆవిష్కరిస్తున్న సభ్యులు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. అన్ని మండలాల నుంచి 150 బృందాలను ఎంపిక చేశారు. ఒక్కోదానిలో ముగ్గురు చొప్పున విద్యార్థులు ఉన్నారు. ఈ నెల 27న జిల్లా స్థాయి పోటీలు ఉంటాయని జేవీవీ అధ్యక్ష, కార్యదర్శులు గౌరునాయుడు, మహేశ్వరరావు తెలిపారు. ❖ **వీరఘట్టం, భామిని, జియ్యమ్మవలస, మక్కువ:** వీరఘట్టం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవో ఆర్.ఆనందరావు, జిల్లా సైన్సు అధికారి జి.లక్ష్మణరావు, భామినిలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.శివకుమార్, మక్కువ, శంబర జడ్పీ ఉన్నత పాఠశాలల్లో, జియ్యమ్మవలసలో హెచ్ఎం కె.ముత్యాలు ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి పోటీలు జరిగాయి.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



శిక్షకులతో ప్రతిభ చూపిన క్రీడాకారులు

బలిజిపేట, సీతానగరం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో ఈ నెల 4, 5, 6 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు బలిజిపేటకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారని శిక్షకులు ఎ.లక్ష్మణ, ఉదయ్, సతీష్, రజనీష్ తెలిపారు. చిలకలపల్లి, బడేవలస, బలిజిపేట, సీతానగరం మండలంలోని గాదెలవలసకు చెందిన కె.సాంబశివరావు, ఎస్.నాగరాజు, పి.సురేష్, పి.శ్రీచరణ్, కె.భానుప్రసాద్, ఆర్.హేమంత్, ఎస్.తిరుపతి, నిఖిల్‌విశాల్, కె.పావని, డి.సౌజన్య, కె.శిషాంక్, పి.నవీన్, పి.కారుణ్య, డి.మనోజ్, ఎ.రవీంద్ర, హైమశ్రీ తదితరులు పలు విభాగాల్లో ఎంపికయ్యారు. ❖ భామిని ఆదర్శ పాఠశాల విద్యార్థులు జి.అభిరాం, జి.ఉదయ్ కుమార్, బి.ఓంకార్, శాంతికుమారి, దేవకి, వి.కార్తికేయ, శాంతికుమారి, బి.లావణ్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ శివకుమార్ తెలిపారు. ❖ **పాలకొండ:** భాసూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎ.చాందిని రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కె.నాగేశ్వరరావు తెలిపారు.



నృత్యాలు చేస్తున్న సాయిరాం డిగ్రీ కళాశాల విద్యార్థులు



వెంగాపురం కళాశాలలో మాట్లాడుతున్న ఎస్సై సింహాచలం

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగాలని సాయిరాం డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్వాగతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలతో అలరించారు. ❖ **బలిజిపేట, సీతానగరం:** విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ పునాదని ఎస్సై సింహాచలం అన్నారు. వెంగాపురం పీఎస్ఎన్ జూనియర్ కళాశాలలో జరిగిన స్వాగతోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కరస్పాండెంట్ పి.హరిప్రసాదరావు, పి.లక్ష్మి, ప్రిన్సిపల్ జగన్నాథరావు, రాంబాబు, జి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. ❖ సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ దాలినాయుడు అధ్యక్షతన కొత్త విద్యార్థుల స్వాగత కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు.

మూడు నుంచి పోలమాంబ ఉత్సవాలు



పాలకొండ గ్రామీణం: పాలకొండ పట్టణం నాగవంశం వీధి కూడలిలోని పురటాల పోలమాంబ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి పది రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ భక్తబృంద సభ్యులు తెలిపారు. ❖ **మక్కువ:** శంబర పోలమాంబ ఆలయంలో ఈ నెల 3 నుంచి 12 వరకు శరన్నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో లాభాలు

గుమ్మలక్ష్మీపురం, సీతానగరం, న్యూస్‌టుడే: రసాయన ఎరువులకు దూరంగా సేంద్రియ పద్ధతిలో పంటలు పండిస్తే ఎన్నో లాభాలు చేకూరుతాయని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రబంధకుడు షణ్ముఖరాజు తెలిపారు. బాతుగుడబ, రాయఘడజమ్ములో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగులో సస్య రక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఎన్ఎఫ్ఏ అన్నపూర్ణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు. ❖ సీతానగరం మండలంలోని కొత్తవలస, బీకేపురంలో ఏడీఏ శ్రీనివాస్ రైతులకు అవగాహన కల్పించారు.

వృద్ధులకు ప్రత్యేక ఓపీ సేవలు

సీతంపేట, న్యూస్‌టుడే: వృద్ధులకు అక్టోబరు నెలలో ప్రత్యేకంగా వైద్యసేవలు అందిస్తామని సీతంపేట ప్రాంతీయాసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆసుపత్రిలో వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, మానసిక ఆరోగ్య సమస్యలు, కళ్లు, ఫిజియోథెరపీ సేవలపై అవగాహన కల్పిస్తామన్నారు. ❖ **పాలకొండ గ్రామీణం:** వృద్ధులను చిన్నచూపు చూడడం తగదని పాలకొండకు చెందిన వైద్యనిపుణుడు పట్నాయక్ పేర్కొన్నారు. జగన్నాథస్వామి ఆలయ వీధిలోని బాలగోపాల లక్ష్మీనరసమ్మ వృద్ధాశ్రమంలో ఉన్నవారిని మంగళవారం సత్కరించారు.

రూ.20 వేలు ఆర్థిక సహాయం

పార్వతీపురం గ్రామీణం: వరద బాధితులకు ఆర్థిక సాయంగా రూ.20 వేలు నగదును ఎమ్మెల్యే విజయచంద్రకు తాళ్లబురిడి యువత అందజేశారు.

విద్యార్థులకు ఆంగ్ల అధ్యయన పుస్తకాలు

జియ్యమ్మవలస: పెదమేరంగి జడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 54 మందికి ఆంగ్ల అధ్యయన సామగ్రిని పాఠశాల సహాయకులు రోజారమణి పంపిణీ చేశారు. దసరా సెలవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెచ్ఎం పార్వతి ఉన్నారు.

పట్టణ ప్రజల దాహార్తి తీర్చండి

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: పార్వతీపురం పట్టణంలో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి కోరారు. నీటి సమస్యపై కలెక్టరేట్ ముందు ఆందోళన చేశారు. కౌన్సిల్ సమావేశంలో ఒక్కసారి కూడా చర్చించకపోవడం అన్యాయమన్నారు. ప్రజల అవసరాలకు తగిన విధంగా నీటి సరఫరా చేయాలన్నారు. ఇన్‌ఛార్జి డీఆర్వో కేశవనాయుడుకు వినతిపత్రం అందించారు.

విశాఖ ఉక్కును కాపాడుకుందాం

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్ నాయకులు అన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్ ముందు శిబిరాన్ని రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి ప్రారంభించారు. ఉత్తరాంధ్రకు తలమానికంగా ఉన్న ఉక్కు పరిశ్రమలో ఉద్యోగులను తొలగించడం సరికాదన్నారు. ఒకేసారి 4 వేల మంది ఉద్యోగులను తొలగిస్తే కుటుంబాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.



శిబిరంలో విద్యార్థి సంఘం నాయకులు

ధర్మ పరిరక్షణకు కృషి



పూజలు చేస్తున్న జన సైనికులు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కె.మల్లేష్ కోరారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా కస్పాగదబవలస వేంకటేశ్వర ఆలయంలో పూజలు చేశారు. సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అయిదు మండలాల కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాణిజ్య పంటలతో రైతుకు మేలు

భామిని, న్యూస్‌టుడే: పత్తి పంటలో పలురకాల వాణిజ్య పంటలు పండిస్తే రైతు అదనపు ఆదాయం పొందొచ్చని ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర రిసోర్సు పర్సన్ సర్వ దేవుళ్లు తెలిపారు. మండలంలోని వాసన్ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ పరివర్తనలో భాగంగా సేంద్రియ పద్ధతిలో పండిస్తున్న పంటలు పరిశీలించారు. 10 రకాల పప్పు దినుసులు, పెసలు, మినుములు, జొన్న, మొక్కజొన్న, నువ్వులు, కొర్రలు, బెండ, కంది, ఆముదాం, చిక్కుళ్లు తదితర పంటల సాగు విధానం గురించి వివరించారు.



పంటలు పరిశీలిస్తున్న అధికారులు

జైలు ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచాలి



సూచనలు అందిస్తున్న జిల్లా న్యాయమూర్తి

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ ఉప కారాగార ప్రాంగణం, ఖైదీల గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని శ్రీకాకుళం జిల్లా న్యాయమూర్తి అహ్మద్ జూనయద్ మౌలానా అన్నారు. మంగళవారం ఉప కారాగారాన్ని సందర్శించారు. ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి, ఖైదీలకు వేడి ఆహార పదార్థాలు అందించాలని కారాగార పర్యవేక్షకుడు బి.జోగులను ఆదేశించారు. అవసరమైన న్యాయసేవల గురించి అవగాహన కల్పించారు.